క్లుప్తంగా

టెక్కలి ఇన్‌చార్జి ఆర్డీఓగా సుదర్శన్ దొర

టెక్కలి: టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయ ఇన్‌చార్జి ఆర్డీఓగా సుదర్శన్ దొర గురువారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ కార్యాలయం కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఈయన టెక్కలి డివిజన్‌కు ఇన్‌చార్జి ఆర్డీఓగా విధుల్లోకి చేరారు. నిన్నటి వరకు ఇక్కడ సబ్ కలెక్టర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి నూరుల్ ఖమర్ ఆర్థిక శాఖ డిప్యూటీ కార్యదర్శిగా పదోన్నతి పొందిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఇన్‌చార్జి ఆర్డీఓను కార్యాలయ సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు.

క్యాన్సర్ బాధితునికి ఆర్థిక సాయం



సాయం అందిస్తున్న ఉద్దానం సేవాసమితి సభ్యులు

కంచిలి: మండలంలోని కర్తలి గ్రామానికి చెందిన పైల తాతయ్య–ధనలక్ష్మిల రెండున్నరేళ్ల కుమారుడు పైల రిషికేశకు బ్లడ్ క్యాన్సర్ వ్యాధి సోకడంతో సాయం చేసేందుకు ఉద్దానం సేవా సమితి ముందుకొచ్చింది. బాలుడి కుటుంబానికి రూ.10వేలు నగదును గురువారం సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో సమితి వ్యవస్థాపకుడు తారక్, సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీ

కవిటి: పనిచేసే చోట, ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని కవిటి తహసీల్దార్ ఎం.లక్ష్మీ, ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. గురువారం కవిటి మండల పరిషత్ కార్యాలయంలో ఇచ్ఛాపురం రూరల్ ప్రాజెక్ట్ ఐసీడీఎస్ పీఓ పురాణం నాగరాణి అధ్యక్షతన అంగన్‌వాడీ, ఆశా, వివిధ శాఖల్లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ ధనం జయమజ్జి, కవిటి, మాణిక్యపురం, రాజపురం, బెలగాం అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్లు పల్లవి, కృష్ణవేణి, లక్ష్మీ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి



మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు

సోంపేట: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు కృషి చేయాలని బేసి రామచంద్రాపురం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్ పట్నాయక్, ట్రీ ఫౌండేషన్ కన్వీనర్ సోమేశ్వరరావు అన్నారు. ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో గురువారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా చెట్లు మానవాళికి కలిగిస్తున్న ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సాయిరాజ్, బ్రహ్మానంద మహాపాత్రో, టి.మాధవరావు, డి.చంద్రశేఖర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి కళాశాలలో కలకలం

కోటబొమ్మాళి : కోటబొమ్మాళి ప్రభుత్వ కాలేజీకి చెందిన కొందరు విద్యార్థులు సమీపంలో ఖాళీగా ఉన్న ఓ ఇంట్లో సిగరెట్లు తాగుతూ, గుట్కా నములుతూ ప్రిన్సిపాల్‌కు పట్టుబడిన ఘటన గురువారం కలకలం సృష్టించింది. మధ్యాహ్న భోజన విరామ సమయంలో అటుగా వచ్చిన ఇంటి యజమాని విద్యార్థుల వ్యవహారాన్ని చూసి విషయం ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేసి చెప్పడంతో ఈ ఘటన వెలుగుచూసింది. వెంటనే ప్రిన్సిపాల్, సిబ్బంది వెళ్లగా కొందరు విద్యార్థులు పారిపోగా, ముగ్గురిని పట్టుకున్నారు. అనంతరం వారిని హెచ్చరించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రులను శుక్రవారం కళాశాలకు పిలిపించి తదుపరి చర్యలు తీసుకుంటామని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామని చెప్పారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న కామర్స్ గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు పీజీలో 55 శాతం మార్కులు, నెట్, స్లెట్, సెట్, పీహెచ్‌డీ చేసిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.



ఆధార్ డ్రైవ్‌పై ఆరా

ప్రభుత్వం స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న శిశు ఆధార్ నమోదు, పెద్దలకు ఆధార్ అప్‌డేట్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని టెక్కలి డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఎం.అలివేలుమంగమ్మ అన్నారు. ఈ మేరకు గురువారం కుసుంపురం గ్రామ సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ స్పెషల్‌డ్రైవ్‌ను పరిశీలించారు. కవిటి ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

– కవిటి



‘హెల్పింగ్’ హ్యాండ్స్

నెలవంక గ్రామం గత నెలలో జరిగిన అగ్నిప్రమాదంలో 13 మేకల్ని కోల్పోయిన దుర్గాశి శ్యామలకు కవిటి మండలం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సభ్యులు గురువారం రూ.5000 నగదు, నిత్యావసర సరుకుల్ని వితరణగా అందించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యుడు కవిటి మండల కోఆప్షన్ సభ్యుడు పాండవ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

– కవిటి



వేషధారణలు అదరహో

విద్యాభ్యాసంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఓ భాగం కావాలని కొళిగాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేంద్రనాథ్ పట్నాయక్ అన్నారు. ‘శిక్ష సప్తాహ్’ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులు వివిధ వేషధారణలతో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉపాధ్యాయులు జ్యోతి, రేణుక, పద్మావతి, మిను, దేవికె, సోమేశ్వరరావు, పాపారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

– ఇచ్ఛాపురం రూరల్



శిక్షాసప్తాహ్

ఆంధ్రప్రదేశ్‌లో తరతరాలుగా తమ జీవనాన్ని సాగిస్తున్న ఒరియా మాతృభాష చదువుతున్న విద్యార్థులు గురువారం శిక్షాసప్తాహ్ ఉత్సవాల్లో భాగంగా పూర్వీకుల సంప్రదాయ వస్త్రధారణలో తళుక్కున మెరిశారు. పెద్ద ఎర్రగోవిందపుట్టుగ ఉపాధ్యాయుడు దేవదాస్ బెజ్జిపల్లి తమ విద్యార్థులతో కలిసి ఈ చక్కని కార్యక్రమాన్ని నిర్వహించారు.

– కవిటి



ఆపదలో అండగా..

సంతబొమ్మాళి గ్రామానికి చెందిన గొటివాడ ప్రసన్నకుమార్‌కు కాలు విరిగిపోవడంతో కొత్తపేటకు చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సంఘం సభ్యులు ఆసరాగా నిలిచారు. వైద్యఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదును గురువారం అందజేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ హాండ్స్ సభ్యులు జీరు రామకృష్ణ, కూచెట్టి భానుప్రకాష్, వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

– సంతబొమ్మాళి

భూగర్భ జలాలు పైపైకి!



వర్షాలు కురుస్తుండటంతో నిండుకుండలా కనిపిస్తున్న చెరువు



టెక్కలి సమీపంలో ఓ బావిలో పైకి చేరిన భూగర్భ జలాలు



టెక్కలి పరిసర ప్రాంతాల్లో పంట పొలాల్లో నిండుగా చేరిన వరద నీరు

- నిన్నమొన్నటి వరకు అడుగంటిన వైనం
- తాజా వర్షాలకు పైకి చేరుకుంటున్న జలాలు

టెక్కలి : నిన్నమొన్నటి వరకు వాతావరణంలో ఉష్ణోగ్రతలు తీవ్రరూపం దాల్చడంతో భూగర్భ జలాలు పాతాళానికి చేరుకున్నాయి. ప్రస్తుతం వాతావరణంలో చోటుచేసుకున్న అల్పపీడన ప్రభావంతో వారం రోజుల నుంచి విస్తారంగా వర్షాలు పడుతుండటంతో భూగర్భ జలాలు మరళా పైకి చేరుకుంటున్నాయి. గడచిన వేసవి కాలంలో ఇళ్లల్లో మంచినీటి బోర్లు వేయాలంటే సుమారు 200 అడుగుల దాటితే తప్పా జలం కనిపించే పరిస్థితులు ఉండేవి కావు. ఏటా నవంబర్‌లో భూగర్భ జలాల శాఖాధికారులు ఫిజో మీటర్ల సాయంతో భూగర్భ జలాల పరిస్థితిని నమోదు చేస్తారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో బావులు, చెరువులు, పంట పొలాల్లో వరద నీరు చేరి భూగర్భ జలాలు పైకి చేరుకుంటున్నాయి. వర్షం నుంచి జాలు వారిన నీటి బొట్టును పొదుపు చేస్తే భవిష్యత్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా భూగర్భ జలాల కొరత అరికట్టవచ్చునని నిపుణులు సూచిస్తున్నారు.

నియోజకవర్గంలో భూగర్భ జలాల శాతం (నవంబర్ నుంచి జూలై నాటికి)

మండలం	గత ఏడాది నీటి మట్టం (మే వరకు)	ప్రస్తుతం
మండలం : టెక్కలి	గత ఏడాది నీటి : 3.00 మీటర్లు మట్టం (మే వరకు)	ప్రస్తుతం : 8.09 మీటర్లు
మండలం : నందిగాం	గత ఏడాది నీటి : 3.47 మీటర్లు మట్టం (మే వరకు)	ప్రస్తుతం : 9.42 మీటర్లు
మండలం : సంతబొమ్మాళి	గత ఏడాది నీటి : 5.10 మీటర్లు మట్టం (మే వరకు)	ప్రస్తుతం : 10.08 మీటర్లు
మండలం : కోటబొమ్మాళి	గత ఏడాది నీటి : 4.23 మీటర్లు మట్టం (మే వరకు)	ప్రస్తుతం : 8.19 మీటర్లు

మత్తు పదార్థాలతో జీవితం చిత్తు



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

టెక్కలి: యువత మత్తు పదార్థాల బారిన పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం టెక్కలిలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థి సంఘం రాష్ట్ర, జిల్లా నాయకులు ఎం.యుగంధర్, జి.వాసు, కె.శ్రీను మాట్లాడుతూ అక్రమ రవాణా ద్వారా గంజాయి, హెరాయిన్, కొకైన్ వంటి మత్తు పదార్థాలు భారీగా దిగుమతులు కావడంతో యువత చెడు మార్గాన్ని అనుసరిస్తున్నారని, ప్రత్యేక నిఘా వేసి వాటిని అరికట్టాలని కోరారు. అనంతరం మానవహారం నిర్వహించారు. ఇటీవల దేశ రక్షణలో వీర మరణం పొందిన జవాన్లు డొక్కరి రాజేష్, సనపల జగదీశ్వరరావులకు స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రవి, ప్రేమ్‌చంద్, కిషోర్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కళాకారులకు ప్రత్యేక గుర్తింపు



నాట్యమయూరి అవార్డులతో కళాకారులు

ఇచ్ఛాపురం: బోనాల ఉత్సవాలు సందర్భంగా హైదరాబాద్ రవీంద్రభారతిలో నాట్యకళ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సిరి ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన ఇండియా లెవల్ డ్యాన్స్‌ఫెస్ట్–2024లో ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన సంగీత కళాకారులు, గాయకులు ఆశి కృష్ణారెడ్డి, జ్ఞానసరస్వతి, స్వేచ్ఛా నృత్యతరంగిణి నాట్యకారులు యశ్విత, శరణ్య, సంజన, భూమిక, లావణ్య, అనుశ్రీలు నాట్యమయూరి అవార్డులు అందుకున్నారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల నుంచి వందలాది మంది కళాకారులు పాల్గొన్నారని స్వేచ్ఛ నృత్యతరంగిణి అకాడమీ అధ్యక్షుడు గోవిందరావు తెలిపారు.

ఉద్యాన పంటలతో రాబడి



కొబ్బరి మొక్కలను పంపిణీ చేస్తున్న దృశ్యం

వజ్రపుకొత్తూరు: ప్రభుత్వ తోడ్పాటుతో ఉద్యానవన పంటలు అభివృద్ధి చేసుకుని రైతులు ఆదాయం పెంచుకోవాలని మాజీ ఎంపీపీ మద్దిల చిన్నయ్య అన్నారు. గురువారం రెయ్యిపాడులో కొబ్బరి పునరుద్ధరణ పథకంలో భాగంగా లబ్ధిదారులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తోటల్లో 60 ఏళ్లు పైబడిన, కాపు కాయని చెట్లు తొలగించి స్థానంలో కొత్త మొక్కలు నాటే కార్యక్రమం ప్రభుత్వం చేపడుతోందని, ఇందుకు సుమారు రూ.1.60 కోట్లు వెచ్చించి 125 మంది రైతులకు 3500 కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్నామని ఉద్యానవన శాఖ అధికారి కె.సునీత తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ బత్సల ధర్మారావు, సూరాడ మోహనరావు, ఎంపీటీసీ సభ్యుడు ఎస్.చిట్టిబాబు, బొర్ర కామయ్య, కె.మల్లేసు, ఎం.పాపారావు, నరేష్, శాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్‌జెడ్ అభిప్రాయ సేకరణపై అసంతృప్తి



శ్రీకాకుళం డీఆర్‌ఓకు వినతిపత్రం అందిస్తున్న మత్స్యకార సంఘాల నాయకులు

కవిటి: కలెక్టర్ కార్యాలయంలో గురువారం సీఆర్‌జెడ్ నోటిఫికేషన్, కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్‌పై నిర్వహించిన అభిప్రాయ సేకరణపై అసంతృప్తి నెలకొందని ఇచ్ఛాపురం నియోజకవర్గ తీర ప్రాంత మత్స్యకార ఐక్యవేదిక ప్రతినిధుల అభ్యంతరం వ్యక్తం చేశారు. సమావేశానికి హాజరుకావాలని జూన్‌లో తహసీల్దార్లకు ముందస్తు సమాచారం అందించగా, తమకు మాత్రం జూలై 24నే అందించి విధిగా హాజరుకావాలని వీఆర్‌ఓలు మౌఖికంగా చెప్పారన్నారు. అయినప్పటికీ హాజరైతే సీఆర్‌జెడ్‌కు సంబంధించి పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన అంశాలపై సంబంధిత అధికారులు చెప్పిన సమాచారంపై తమకు సానుకూలత వస్తుందని ఆశించినా ఫలితం లేకపోయిందన్నారు. ఈ మేరకు సమావేశం ముగిసిన తర్వాత అభ్యంతరాలతో కూడిన వినతిపత్రాన్ని డీఆర్‌ఓ గణపతిరావుకు అందజేశారు. జిల్లా కలెక్టర్ దృష్టికి తమ అభ్యంతరాల్ని నివేదించాలని వివరించారు. సముద్రంలో చేపల వేటే తమకు జీవనాధారమని, దాన్ని హరించే ఎటువంటి ప్రయత్నాల్ని అంగీకరించబోమని స్పష్టం చేశారు.

గొర్రెలకాపర్లకు పరిహారం అందించాలి



కాశీబుగ్గ: ఇటీవల కుక్కల దాడిలో మరణించిన గొర్రెలకు సంబంధించి కాపర్లకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని యాదవ సంఘం జిల్లా నాయకుడు కొర్రాయి బాలకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. పలాసలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గొర్రెలు, మేకల పెంపకందారులకు 40 ఏళ్లతకే పింఛను మంజూరు చేయాలన్నారు. గుర్తింపు కార్డులను మంజూరు చేసి పిల్లలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లుత కల్పించాలని, సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని, హెల్త్ కార్డులు అందజేయాలని, యాదవులను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఎ గ్రూపులోకి మార్చాలని కోరారు.

సులభతరంగా రుణాల మంజూరు



మాట్లాడుతున్న బ్యాంకు ప్రతినిధులు

ఇచ్ఛాపురం రూరల్: స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులకు ఎటువంటి అడ్డంకులు లేకుండా అంతర్గత అవసరాల కోసం రుణాలు అందజేస్తామని యూబీఐ, ఏపీజీవీబీ బ్రాంచి మేనేజర్లు లీలంత్ మిశ్రా, డి.శోభన్‌బాబు అన్నారు. గురువారం ఇచ్ఛాపురం మండల మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో వీవోఏలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రప్రభుత్వ పథకాలైన పీఎంఎఫ్ఎంఈ, పీఎంఈజీపీ, ముద్ర రుణాలపై చర్చించారు. కార్యక్రమంలో సెర్ప్ ఏపీఎం సనపల ప్రసాదరావు, 35 సంఘాల వీఓఏలు, సీసీలు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పలాస: ద్విచక్ర వాహనచోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని సివిల్ జడ్జి యు.మాధురి చెప్పారు. పలాస మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో గురువారం సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

న్యాయవాదుల నిరసన



విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ఇచ్ఛాపురం: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన కొత్త క్రిమినల్ కేసుల చట్టాలను వ్యతిరేకిస్తూ వాటిని అమలు చేయవద్దని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఇచ్ఛాపురం జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణయ్య అధ్యక్షతన న్యాయవాదులు విధులు బహిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రతినిధుల ఎస్‌వీఎస్ రంగారావు, ఆర్.దేవరాజ్, దక్కత కృష్ణమూర్తి, గిన్ని సీతయ్య, మనోజ్‌కుమార్, తారక రామారావు, వరలక్ష్మి, బైరి, పాడీ, ప్రసాద్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఓ 217 రద్దుపై హర్షం

వజ్రపుకొత్తూరు: జీఓ 217తో మత్స్యకారుల్లో ఆనందం వెల్లివిరిసిందని బీజేపీ జిల్లా మత్స్యకార సెల్ విభాగం కన్వీనర్ గుంటు ధనరాజ్ అన్నారు. గురువారం పూండిలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జీఓ రద్దు వల్ల మత్స్యకారులు చెరువుల్లో చేపలు పట్టేందుకు అవకాశం కలిగిందన్నారు. టెండర్లు లేకుండానే మత్స్యకారులు చేపల వేట చేసుకునేందుకు వీలు కల్పించించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

తుఫాన్ షెల్టర్ల పరిశీలన



రామయ్యపట్నంలో తుఫాను రక్షిత భవనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ భరత్‌నాయక్

సోంపేట: పలాస ఆర్డీఓ భరత్‌నాయక్ గురువారం గొల్లూరు, రామయ్యపట్నంలో ఇటీవల నిర్మించిన మల్టీపర్పజ్ తుఫాన్ షెల్టర్లను పరిశీలించారు. మండలంలో శిథిలావస్థకు చేరుకున్న తుఫాను రక్షిత భవనాల వివరాలను తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆర్ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

డీజీపీని కలిసిన ఎమ్మెల్యే శిరీష

కాశీబుగ్గ: రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమలరావును పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రాష్ట్ర ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి విజయ ఆనంద్‌ను కలిసి పలాసలో అదనపు సబ్ స్టేషన్స్ ఏర్పాటు చేయాలని కోరారు.

సంక్షిప్తంగా...

రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు కొత్త ఖాతాలు

కాశీబుగ్గ: రైతు ఉత్పత్తిదారుల సంఘాలు కొత్త ఖాతాలు తెరవాలని ఏపీఎం గొడబ ప్రసాదరావు సూచించారు. మందస మేజరు పంచాయతీలోని ఎస్‌బీఐ బ్రాంచిలో మేనేజర్ కృష్ణచంద్ర పాత్రో ఆధ్వర్యంలో గురువారం సీబీఆర్ఎం సమావేశం నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ రామ్ మనోహర్, సీసీ కిషోర్, వీఓఏలు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థులకు సాయం

కంచిలి: మండలంలోని గిరిజనాభివృద్ధి సంస్థ పరిధిలోని విద్యార్థులకు సోంపేట రోటరీ క్లబ్ ప్రతినిధులు సాయం అందించారు. నువాగడ హైస్కూల్ విద్యార్థుకు వైద్య పరీక్షలు చేయించి మందులు పంపిణీ చేశారు. మూడు ప్రాథమిక పాఠశాలల్లో 67 మంది విద్యార్థులకు ప్లేట్లు వితరణ చేశారు. కార్యక్రమంలో హైస్కూల్ హెచ్ఎం దుర్గాప్రసాద్ పాఢి, రోటరీ క్లబ్ ప్రతినిధులు దుద్ది శ్రీనివాసరావు, డాక్టర్ ఇరోతు లక్ష్మీనారాయణ, టంకాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సరుకుల నాణ్యత పరిశీలన

కంచిలి: మండల కేంద్రం కంచిలిలో పలు కిరాణా దుకాణాల్లో నిత్యావసర సరుకుల నాణ్యత, ధరలను జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి బగాది శాంతి గురువారం పరిశీలించారు. సీఎస్‌డీటీ పి.కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి శుద్ధి ప్లాంట్ వద్దని వినతి

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని రత్తకన్న గ్రామంలో 18వ వార్డులో మురుగునీటిని శుద్ధిచేసే ప్లాంట్‌ని ఏర్పాటు చేయవద్దని వార్డు ప్రజలు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సోంపేట: మండలంలోని సోంపేట, కొర్లాం సబ్‌స్టేషన్ల పరిధిలో నిర్వహణ పనుల నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సోంపేట, బెంకిలి, జింకిభద్ర, కొర్లాం, పాలవలస, కర్తలిపాలేం పంచాయతీలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం, ఈదుపురం సబ్‌స్టేషన్ పరిధిలోని ఇచ్ఛాపురం హాస్పిటల్ రోడ్, మంగళవారంపేట, డొంకూరు, కేశుపురం, తిప్పనపుట్టుగ, మండపల్లి ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ తెలిపారు.

కాశీబుగ్గ: మున్సిపాలిటీలోని జీఎంఈ కాలనీ, ఆర్.కె.పురం, పెంటిబద్ర, జె.ఆర్.సి.పురం, పద్మనాభపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పేర్కొన్నారు.

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరు, అక్కుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

కాశీబుగ్గ: మందస మండలం కొండలోగాం పంచాయతీ పరిధి చాపరాయి గ్రామంలో పోలీసులు ఆకస్మిక మెరుపు దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో సెబ్ ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది కాంతారావు, శాంతరావు తదితరులు పాల్గొన్నారు. మందస మండలంలో నాటుసారాని పూర్తి స్థాయిలో నివారించడానికి కృషిచేస్తున్నామని సెబ్ సీఐ ఆర్ జైభీమ్ తెలిపారు. నాటసారా తయారీ, రవాణా గురించి గానీ, నాటుసారా అమ్మకాలను గురించి 9440902358 నంబరకు తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

సాంకేతిక బోధనతో నైపుణ్యాలు

కంచిలి: నూతన సాంకేతిక బోధనతో విద్యార్థుల్లో నైపుణ్యాలను పెంపొందించవచ్చని ఎంఈఓ–2 కె.చిట్టిబాబు అన్నారు. బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ వారోత్సవాల్లో భాగంగా గురువారం విద్యార్థులు భక్తి గీతాలు, మీరాబాయి కీర్తనలను ఆలపించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

కాశీబుగ్గ: సరిహద్దుల్లో దేశ రక్షణతో పాటు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడటానికి కూడా సిద్ధంగా ఉన్నామని మాజీ సైనికుల సంఘ అధ్యక్షుడు ఇళ్ల మన్మథరావు గురువారం అన్నారు. కార్గిల్ విజయ దివస్ సందర్భంగా ఈఎస్ఎం యూనియన్, పలాస మాజీ సైనికుల సహకారంతో శ్రీపవనపుత్ర సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

కొత్తపల్లి పాఠశాలలో విద్యార్థుల సందడి

కాశీబుగ్గ: మందస మండలం కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం శిక్షా సప్తహ్‌లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం ఎస్.గణేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఆటపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.దామోదరం, జి.భీమారావు, ఎం.లక్ష్మణరావు, ఎస్.కిరణ్‌కుమార్, ఎస్.అబ్రహం, ఎం.చిత్రసేన, గోపాలకృష్ణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అదనపు భవనం ప్రారంభం

కాశీబుగ్గ: మందస మండలం సొండిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన అదనపు భవనాన్ని శుక్రవారం ఉదయం ప్రారంభిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయుడు బి.సుందర్ సాల్మన్ ఒక ప్రకటనలో తెలిపారు.

రైతులకు ఎరువుల పంపిణీ

సోంపేట: ఎరువులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారి బి.నర్సింహమూర్తి కోరారు. సోంపేట పీఏసీఎస్ వద్ద గురువారం రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. డీసీసీబీ చీఫ్ మేనేజర్ చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ శ్రీనివాసరావు, మాకన్నపురం సర్పంచ్ మద్దిలి నాగేశ్వరరావు, పీఏసీఎస్ సీఈవో నారాయణరావు పాల్గొన్నారు.